
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com | మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3 / కనిష్ఠం 15.2

ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5 | బుధవారం 13 నవంబరు 2024





జైనథ్ మండలం పిప్పర్‌వాడ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు



● బేల మండలం శంకర్‌గూడ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



'మహా' సరిహద్దుపై.. నిఘా

- మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తమైన జిల్లా అధికారులు
- యావత్‌మాల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారుల సమావేశం
- మహారాష్ట్ర సరిహద్దుల్లో అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులు
- ఎన్నికల ప్రలోభాల కట్టడికి పోలీసుల ముమ్మర తనిఖీలు
- సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక సిబ్బంది నియామకం

ఆదిలాబాద్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే మహారాష్ట్ర యవత్‌మాల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇరు రాష్ట్రాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారుల అంతర్ రాష్ట్ర సమావేశాన్ని నిర్వహించారు. ఇరు రాష్ట్రాల మధ్య అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులు, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న పోలింగ్ స్టేషన్, శాంతి భద్రతలు, సిబ్బంది నియామకంపై చర్చించారు. త్వరలో జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లా-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంపై గట్టి నిఘాను సారిస్తున్నారు. ఉత్తర తెలంగాణ ముఖ ద్వారమైన జిల్లాతో సరిహద్దును కలిగి ఉన్న యవత్‌మాల్, చంద్రాపూర్ జిల్లాలకు వెళ్లే మార్గాలలో అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. జిల్లా నుంచి మహారాష్ట్రకు వెళ్లే వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేస్తూ ఎన్నికల ప్రలోభాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా డబ్బు, మద్యం, బహుమతుల సరఫరాపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిరంతరంగా తనిఖీలు చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించి నిఘా సారిస్తున్నారు.

ఏడు అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులు

జిల్లా మహారాష్ట్ర సరిహద్దుల్లో అధికారులు ఏడు అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరంగా తనిఖీలు చేపడుతున్నారు. తలమడుగు మండలం లక్ష్మీపూర్, బేల మండలం శంకర్‌గూడ, జైనథ్ మండలం ఆనంద్‌పూర్, పిప్పర్‌వాడ, బోథ్‌మండలం ఘన్‌పూర్, భీంపూర్ మండలం కరంజి, గాదిగూడ మండలం మేడిగూడ వద్ద అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించి తనిఖీలు నిర్వహిస్తున్నారు. మూడు షిఫ్టులుగా అధికారులు తనిఖీలు చేస్తున్నారు. అయితే జిల్లా సరిహద్దుల్లో ఉన్న పెన్‌గంగాలో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో పెన్‌గంగా నది మీదుగా మహారాష్ట్రలోని పలు గ్రామాలకు యథేచ్ఛగా రాకపోకలు సాగుతున్నాయి. రోడ్డు మార్గాల పైననే దృష్టి సారిస్తున్న పోలీసులు పెన్‌గంగా నది మీదుగా సాగుతున్న రాకపోకలను పసిగట్టలేక పోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అలాగే రైలు మార్గం గుండా నిత్యం జిల్లాకు వేల మంది ప్రయాణికులు వస్తూ పోతుంటారు. అయితే, రైల్వే స్టేషన్ వద్ద సరైన నిఘా కొరవడిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాకు మహారాష్ట్రతో పలు రకాల వ్యాపార సంబంధాలు ఉన్నాయి. పోలీసులు నిఘా సారించక పోవడంతో అడ్డదారుల్లో అక్రమ దందాలు సాగుతున్నట్లు తెలుస్తుంది.

పట్టుబడుతున్న డబ్బు, మద్యం

మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో సరిహద్దుల్లో అధికారులు అప్రమత్తం కావడంతో అక్రమంగా తరలిస్తున్న డబ్బు, మద్యం నిల్వలు పట్టుబడుతున్నాయి. అలాగే జిల్లా మీదుగా ఉత్తరాది రాష్ట్రాలకు తరలించే గంజాయి రవాణాపై నిఘా సారిస్తున్నారు. ముఖ్యంగా బోథ్ మండలం ఘన్‌పూర్, తలమడుగు మండలం లక్ష్మీపూర్, జైనథ్ మండలం బోరజ్ చెక్‌పోస్టులను తరచూ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. జిల్లా మీదుగా జరుగుతున్న అక్రమ రవాణాకు ఎలాంటి ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో సేకరించిన రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తూ పట్టుబడుతున్న

(...తరువాయి 6వ పేజీలో)



● జిల్లా సరిహద్దుల్లో వాహనాన్ని తనిఖీ చేస్తున్న మహారాష్ట్ర పోలీసులు

ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు : స్వీప్ నోడల్ అధికారి

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికలతో పాటు ఓటరు నమోదుపై ప్రతీఒక్కరికి అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఓటరు నమోదు, ఎన్నికలు, ఓటు హక్కుపై ఆయా పాఠశాలల విద్యార్థులు నాటికలు ప్రదర్శించారు. నాయకుడిని ఏవిధంగా ఎన్నుకోవాలో వివరిస్తూ ప్రదర్శించిన నాటికలు అలరించాయి. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదుపై విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. 18ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలని, ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. వీటిపై క్షేత్రస్థాయిలో చర్చ జరగాలనే ఉద్దేశంతో విద్యార్థులతో ప్రదర్శన ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు శివాలయ వార్షికోత్సవం

తలమడుగు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్లపల్లి గ్రామంలో శివాలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్లపల్లి గ్రామంలో వైకుంఠంలో ఏకబిల వృక్షం నిర్మించిన మహాశివుని ఆలయ వార్షికోత్సవాన్ని కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఏకబిల శివాలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు.

..బంజారా సేవా సంఘ సమావేశం

నేరడిగొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మండల సమావేశాన్ని బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు రూపావత్ బాబులాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రిటైర్డ్ ఈఈ రాథోడ్ భీంరావు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

హనుమాన్ ఆలయ పనుల ప్రారంభం

జైనథ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనంద్ పూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయం పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆనంద్‌పూర్ పోచమ్మ ఆలయంలో గల పోచమ్మ విగ్రహానికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఇందులో అర్చకులు సీహెచ్ పోతన్న, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

పండరీపూర్‌కు తరలిన భక్తులు

ఉట్నూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతియేటా కార్తీక మాసంలో పండరీపూర్‌లోని విఠల్ రుక్మాబాయి దర్శనం కోసం జిల్లాలో పాదయాత్ర ప్రారంభించిన భక్తులు మంగళవారం మహారాష్ట్రలోని పండరీపూర్‌కు చేరుకున్నారు. ఈ నెల 4న ఆసిఫాబాద్ నుంచి ప్రారంభమైన భక్తుల పాదయాత్ర కెరమెరి, జైనూర్, లింగోజితండా, ఉట్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్‌ల మీదుగా జిల్లా కేంద్రానికి ఆదివారం చేరుకుంది. జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో బయలుదేరిన భక్తులు మంగళవారం పండరీపూర్ చేరుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా అక్కడి కార్యక్రమాలలో పాల్గొని విఠల్ రుక్మాబాయిని దర్శనం చేసుకొని తిరిగి వస్తారని ఆయన తెలిపారు.



పండరీపూర్‌కు చేరుకున్న భక్తులు

పొరపాట్లు లేకుండా సర్వే చేపట్టాలి

● ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య ● జిల్లాకేంద్రంలోని పలు కాలనీల్లో కొనసాగుతున్న సర్వే నిర్వహణ తీరు పరిశీలన



ఆదిలాబాద్‌లో సర్వే తీరును పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి



ఉట్నూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తూ..

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గుణన సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణ ఆదిత్య అన్నారు. దీనిలో భాగంగా మంగళవారం జిల్లాకేంద్రంలోని రిక్షా కాలనీ, ఓల్డ్ హౌసింగ్ బోర్డ్‌లో కొనసాగుతున్న సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌ల్లో పూర్తిస్థాయిలో కుటుంబ సభ్యుల వివరాలు, సర్వే ముందు రోజు ఆ ప్రాంత ప్రజలకు సమాచారం అందించాలన్నారు. ఇంటి యజమానులు అవసరమైన ఆధార్, రేషన్ కార్డులు, ధరణీ పాస్ బుక్ పత్రాలతో సిద్ధంగా ఉండేలా వారికి తెలపాలని తెలిపారు. ఇందులో కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఎం సుధ, సివిల్ సప్లై అధికారి, డీఏవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, ఏపీఎం, తదితరులు పాల్గొన్నారు.

● రైతుల పంటను పూర్తిగా కొనుగోలు చేయాలి

ఉట్నూర్(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు పండించిన వరి ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య అన్నారు. మంగళవారం మండలంలోని బీరుసాయి పేట, దంతలపల్లిలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళ సంఘాలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ధాన్యం తేమ గుర్తిస్తున్న వివరాలు, పంటను శుభ్రం చేసి పరికరాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెడ్డిగూడెంలో నిర్వహిస్తున్న కుల గణన సర్వేను పరిశీలించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఎంపీడీవో రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



బాబా చిత్రపటానికి పూజలు చేస్తున్న ఆదివాసీ ఆంధ్ సంఘ నాయకులు

పూలాజీబాబా చూపిన మార్గంలో నడవాలి

ఇంద్రవెల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పూలాజీబాబా చూపిన ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని పూలాజీబాబా తనయుడు, పట్నాపూర్ సిద్ధేశ్వర్ సంస్థాన్ అధ్యక్షుడు ఇంగ్లే కేశవ్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని మామిడిగూడ గ్రామంలో పూలాజీబాబా ధ్యాన కేంద్రం 25వ వార్షికోత్సవంలో భాగంగా ఆధ్యాత్మిక సత్ సంఘ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి గ్రంథ పూజ, పూలాజీ బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ఇందులో గ్రామ పటేల్ పాంద్రే శ్యాంరావు, ఆదివాసీ ఆంధ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడే కైలాష్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాకురే రాందాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, గ్రామస్థులు ధనాజీ, సూదం, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

గుడిహత్నూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమ్రి(బీ) ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని కొడప అంజలి పెన్సింగ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆడే రాజేశ్వర్ తెలిపారు. ఇటీవల మహబూబాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే పోటీల్లో పాల్గొననుందని తెలిపారు. ఇందులో పీడీ రామచంద్రం, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రతాప్, వసంత్, శేషబాయి, శశికళ, అరుణ, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

బీఎడ్ కళాశాలలో రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయాలి : రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఉట్నూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో కొనసాగుతున్న బీఎడ్ కళాశాలలో శాశ్వత ప్రాతిపదికన లెక్చరర్లు, ఇతర నాన్ టీచింగ్ స్టాఫ్‌ను భర్తీ చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసంసచిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ పీవో క్యాంపు కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాకి వినతిపత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉట్నూర్ బీఎడ్ కళాశాల స్థాపించి 16ఏళ్ల నుంచి రెగ్యూలర్ పోస్టులను భర్తీ చేయలేదని, వేల మంది గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్య అందించే బీఎడ్ కళాశాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. గతంలో ఉట్నూర్ లాల్‌టెకిడిలో కొనసాగే డీఎడ్ కళాశాలను ప్రభుత్వం మూసి వేసిందని తెలిపారు. రెగ్యూలర్ స్టాప్ ప్రభుత్వం నియమించక పోవడంతో కాశాల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని తక్షణమే శాశ్వత ప్రాతిపదికన ప్రిన్సిపాల్, లెక్చరర్, ఇతర పోస్టులను భర్తీ చేసి బీఎడ్ కళాశాలను కాపాడాలని కోరారు. పీవో సానుకూలంగా స్పందించి భర్తీ చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారన్నారు. ఇందులో జిల్లా కార్యదర్శి తొడసం భీంరావు, మండల అధ్యక్షుడు కనక మలుకు, కార్యదర్శి మడావి నాగోరావు, తదితరులు పాల్గొన్నారు.

తాంసిలో ముగిసిన సోయా కొనుగోళ్లు

తాంసి రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గత 20 రోజుల నుంచి మండల కేంద్రంలోని సహకార సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న సోయా కొనుగోళ్లు మంగళవారంతో ముగిశాయి. సోయా రైతుల దగ్గర నుంచి ఎకరానికి 10 క్వింటాళ్ల చొప్పున కొనుగోలు చేశామని సొసైటీ సీఈవో కేశవ్ తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు సోమవారం రాత్రి వరకు కొనుగోలు చేశామని మంగళవారం నుంచి కొనుగోలు నిలిపివేశామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు. తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన సోయా రైతుల వద్ద నుంచి పూర్తిస్థాయి కొనుగోలు చేశామని వివరించారు. సోయాలు అమ్మిన రైతులకు వారం, పది రోజుల్లోగా వారి వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని పేర్కొన్నారు. ఎవరికైనా సకాలంలో డబ్బులు రాకపోతే కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ పాటికి 40 శాతం మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరిగిందని ఆయన వివరించారు.



అధ్వానంగా గ్రామీణ రహదారులు

- ఉట్నూర్ ఏజెన్సీలో మరమ్మతులకు నోచుకోని రోడ్లు
- ఆదివాసీ, గిరిజనులకు తప్పని తిప్పలు
- ఇబ్బందుల మధ్యే స్థానికుల రాకపోకలు

7లో



కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు



ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌస్‌ఆలం

కమనీయం.. కార్తీక దీపోత్సవం

● భక్తులతో పరవశించిన డైట్ కళాశాల మైదానం

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సామూహిక కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం, మాజీ మంత్రి జోగు రామన్న, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, సమితి సభ్యులు బండారి వామన్‌లు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు భక్తి గీతాలపై చేసిన నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ కార్తీక మాసం ఎంతో పవిత్రమైనదని ప్రజలు ఆధ్యాత్మిక భావనలు పెంపొందించుకోవాలని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను కొనియాడారు. ప్రతి ఒక్కరు కార్తీక మాసంలో భక్తి ప్రపత్తులతో దీపాన్ని వెలిగించి లక్ష్మీదేవిని ప్రసన్నం చేసుకోవాలన్నారు. ఇందులో ఉత్సవ సమితి సభ్యులు, ప్రమోద్ కుమార్ ఖత్రి, ఉదయ్‌కుమార్, హిందూ ధర్మ వలంటీర్స్, మహిళలు పాల్గొన్నారు.

● బోథ్‌లో కన్నుల పండుగగా దీపోత్సవం

బోథ్(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివ భక్త మార్కండేయ ఆలయంలో భక్తులు దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితులు అరవింద్ శర్మ చేతుల మీదుగా శివునికి రుద్రాభిషేకం జరుగగా లింగ రూపంలో మహిళలు దీపాలు వెలిగించారు. పట్టణానికి చెందిన మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షుడు సిరిపురం చంద్రమోహన్, కోశాధికారి కటకం నగేష్, ఆడేపు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



బోథ్‌లోని శివ భక్త మార్కండేయ ఆలయంలో వెలిగించిన దీపాలు

'మహా' సరిహద్దుపై నిఘా

(5వ పేజీ తరువాయి...)

దాఖలాలు ఉన్నాయి. మహారాష్ట్ర ఎన్నికలతో అక్రమ రవాణాకు కొంత అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే కాలినడకన కొందరు వ్యాపారులు రాత్రికి రాత్రే పెన్‌గంగా మీదుగా గుట్టుచప్పుడుకాకుండా మద్యాన్ని తరలిస్తూ అమ్మేసుకుంటున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి.

ప్రత్యేక కమిటీ నియామకం

మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నగదు స్వాధీనంపై ప్రత్యేకాధికారుల కమిటీని నియమించారు. ఈ కమిటీలో జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి బి.మోహన్, జిల్లా ట్రెజరర్ కోశాధికారి ఎన్.హారికను నియమిస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి అనుమతులు, ఆధారాలు లేకుండా నగదును తరలించే క్రమంలో అధికారులు స్వాధీనం చేసుకుంటే కమిటీ సభ్యుడు బి.మోహన్‌ను సంప్రదించాలని సూచించారు. నగదు స్వాధీన పంచనామా పత్రాన్ని చూపాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

నిరంతరంగా తనిఖీలు

: ఎల్.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ



ఆదిలాబాద్-మహారాష్ట్ర సరిహద్దుల్లో నిరంతరంగా తనిఖీలు చేపడుతున్నాం. ఇప్పటి వరకు బోథ్ మండలం ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఎలాంటి ఆధారం లేదన్న కారణంగా రూ.60వేల నగదు, 190 బాటిళ్ల దేశీదారు మద్యాన్ని పట్టుకున్నాం. రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తరలిస్తే సరైన ఆధారాలు చూపాల్సి ఉంటుంది. అలాగే క్రికెట్ కిట్లు, సారీలు, కుక్కర్లు, ఇతర గిఫ్ట్ వస్తువులపై ప్రత్యేకదృష్టిని సారిస్తున్నాం. మహారాష్ట్రలో ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు తనిఖీలు కొనసాగుతాయి.

కొడంగల్ సంఘటన పట్ల ఉద్యోగుల నిరసన

ఉట్నూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లెగిచర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్‌పై జరిగిన దాడికి నిరసనగా ఐటీడీఏ ఉద్యోగులు రెవెన్యూ ఉద్యోగులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జిల్లా అధికారి యంత్రం పై చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలంటూ ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తాకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ వసంతరావు, పరిపాలన అధికారి దామోదర్ స్వామి, అమృతలాల్, స్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

● అధికారులపై దాడిని ఖండిస్తున్నాం : తహసీల్దార్

సిరికొండ(ఆంధ్రజ్యోతి): ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో సహ తహసీల్దార్ ఇతర అధికారులపై దాడి చేయడం బాధకరమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని సిరికొండ తహసీల్దార్ తుకారాం అన్నారు. వికారాబాద్ కలెక్టర్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆయన రెవెన్యూ ఉద్యోగులతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తుకారాం మాట్లాడుతూ.. వికారాబాద్ కలెక్టర్‌తో పాటు ఉద్యోగులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా గ్రామానికి వెళ్లిన అధికారులపై దాడి చేయడం శోచనీయమని ఆక్షేపించారు. ప్రజాభిప్రాయాన్ని చెప్పాలి తప్ప దాడి చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ ఉపేందర్, ఆర్‌ఐ విలాస్, సర్వేయర్ గణేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

15 వరకు రేషన్ సరుకుల పంపిణీ

తాంసి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతినెలా 15వ తేదీ వరకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నామని లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాంసి, గిరిగావ్, డీఆర్ డిపో సేల్స్‌మెన్ రాథోడ్ గణేష్ పేర్కొన్నారు. తాంసిలో నెల 1వ తేదీ నుంచి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని మంగళవారం వరకు 80 శాతం మంది లబ్ధిదారులు మాత్రమే రేషన్ బియ్యాన్ని తీసుకున్నారని తెలిపారు. మిగతా 20శాతం మంది 15లోగా తీసుకోవాలని కోరారు. బుధవారం గిరిగావ్‌లో రేషన్ బియ్యం పంపిణీ చేస్తామని గురువారం నుంచి మళ్లీ తాంసిలో పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. తాంసి గ్రామస్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. తిరిగి గురువారం నుంచి తాంసిలో పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ప్రతినెలా వంద శాతం మంది లబ్ధిదారులకు బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, అదేమాదిరిగా ఈనెల కూడా వంద శాతం పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సర్వేలో తప్పులు లేకుండా చూడాలి : ఎంపీడీవో

● గ్రామాలలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

తాంసి రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులు నుంచి మండలంలోని ఆయా గ్రామాలలో చేపట్టిన కుటుంబ సర్వేను పకడ్బందీగా చేయాలని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాలలో చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని కుటుంబాలను సర్వే చేశారు అడిగి తెలుసుకున్నారు. సర్వే చేసేటప్పుడు ప్రజలు ఎలా సహకరిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఇందులో ఆయా గ్రామాల కార్యదర్శులు, సర్వే సిబ్బంది తదితరులు ఉన్నారు.

● పరిశీలించిన మండల అధికారులు

ఇంద్రవెల్లి(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వే మండలంలోని అన్ని గ్రామాలలో కొనసాగుతుంది. మంగళవారం మండలంలోని అన్ని గ్రామాలను ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ సర్వేను పరిశీలించారు. మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర సర్వే ప్రక్రియను డిప్యూటీ తహసీల్దార్ రమేష్ పరిశీలించారు. సర్వేలో తప్పులు లేకుండా ప్రజలు తెలియజేసిన వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ సర్వేలో ఫీల్డ్ అసిస్టెంట్ జాదవ్ విఠల్, తదితరులు పాల్గొన్నారు.

● 'ప్రభుత్వ సర్వేకు సహకరించాలి'

ఉట్నూర్(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబం సర్వేకు ప్రజలందరు సహకరించాలని ఉట్నూర్ మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని ఘన్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శంభుగూడలో ఆడరాజు పటేల్ ఇంట్లో నిర్వహిస్తున్న కుల గణన, సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అధికారులకు కుటుంబ వివరాలు సేకరించుటకు అందరు సహకరించాలని అన్నారు. ఇందులో ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కుంటాల రాములు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆదిలాబాద్ డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. చెల్లించని పక్షంలో కలెక్టరేట్ ఎదుట సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిషాన్ ఘాట్ కాలనీ వాసులు ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిల సమక్షంలో భారీ సంఖ్యలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం భోజారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే చాలా ప్రాంతాల్లో సరైన రోడ్లు లేవని, విద్యుత్ సౌకర్యం, నీటి సదుపాయం లేదన్నారు. వాటన్నింటి పరిష్కారాన్ని కంది శ్రీనివాస్‌రెడ్డి ద్వారా కృషి చేస్తామన్నారు.

ఆర్టీసీ కార్గో సిబ్బంది అవగాహన ర్యాలీ

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో సేవల ద్వారా హైదరాబాద్‌లో డోర్ డెలివరీ సర్వీసును ప్రారంభించిన సందర్భంగా మంగళవారం ఆదిలాబాద్‌లో ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాపారులను కలుస్తూ ఆర్టీసీ కార్గో సేవలపై కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కార్గో అధికారి పాల్ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి వస్తువులను నేరుగా ఇంటి వద్దకే ఆర్టీసీ కార్గో ద్వారా పంపించుకోవచ్చన్నారు. ప్రజలు, వ్యాపారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

8వ తరగతి విద్యార్థులకు క్షేత్ర సందర్శన

బోథ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోనాల గ్రామ ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు ద్రవ్యం, బ్యాకింగ్ పాఠ్యాంశానికి సంబంధించిన విషయాలను అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు గ్రామీణ బ్యాంకుకు తీసుకెళ్లి అనుమానాలను నివృత్తి చేశారు. విద్యార్థులు తెలియని విషయాలను బ్యాంకు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు మధుసూధన్, మేనేజర్ సురేందర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

తాగిన మైకంలో రైతు ఆత్మహత్య

ఉట్నూర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పంట చేనులో పంటకు కావాలి ఉంటూ తాగిన మైకంలో పంటలకు కొట్టాల్సిన పురుగుల మందును తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉట్నూర్ మండలంలో చోటు చేసుకుంది. ఉట్నూర్ ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. మండలంలోని కామాయిపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అల్లిగూడ గ్రామానికి చెందిన గిరిజన రైతు కోట్నాక్‌చిన్ను(40) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని తెలిపారు. తాగిన మైకంలో క్రిమిసంహారక మందు తాగి చేనులోనే పోయాడు. ఇంటికి రాకపోవడంతో భార్య లక్ష్మి బంధువులతో వెతికగా.. సోమవారం మృతదేహం లభించిందని తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

● పురుగుల మందు తాగి యువకుడు..

తలమడుగు(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్సి(బి) గ్రామానికి చెందిన కుమ్ర శివకాంత్ అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై అంజమ్మ తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. శివకాంత్ ఈనెల 7న మద్యం తాగి మోటార్ సైకిల్ డ్రైవింగ్ చేసి పడిపోవడంతో తన బాబాయ్ మందలించగా.. క్షణికావేశంతో పురుగుల మందు తాగాడని తెలిపారు. చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని ఎస్సై అంజమ్మ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

'లంబాడీలను వేధిస్తున్న సర్కార్'

నేరడిగొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ సార్కరు లంబాడీలను వేధిస్తోందని లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఫార్మా కంపెనీల పేరుతో సీఎం సొంత నియోజకవర్గంలోని రైతులు, ప్రజలను వేధిస్తున్నారని, లంబాడీల భూములను అక్రమంగా లాక్కోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. స్థానికుల భూములను ఫార్మా కంపెనీలకు కట్టబెట్టాలని అధికారులు యత్నిస్తున్నారని విమర్శించారు.

సబ్బుల తయారీపై మహిళలకు శిక్షణ



మహిళలకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్

దిలావర్‌పూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండంపల్లిలో ఈడీఐఐ యాక్సెంచర్ ఆధ్వర్యంలో మహిళలకు సబ్బుల తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ రవి మాట్లాడుతూ... హౌస్‌హోల్డ్ సప్లైసెస్‌లో సర్ఫ్, సబ్బులు, తయారీ విధానంతో పాటు వాషింగ్ మిషన్ లిక్విడ్ ఫ్లోర్ క్లీనర్, డిష్‌వాష్ హెర్బల్ సోప్స్ వంటి 13 రకాల ఉత్పత్తులపై ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సులోచనరెడ్డి, సుమలత, అసిస్టెంట్ పోస్ట్ బ్లాక్ మేనేజర్ భాగ్యలక్ష్మి, వీవోఏ రాములు, ముత్యం, సక్కారం, మాస్టర్ ట్రైనర్స్ దేవేందర్ నాయక్, అలేఖ్యలు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● పెన్షనర్ల సంఘం జాతీయ కార్యదర్శి

నిర్మల్ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఉన్న పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జాతీయ పెన్షనర్ల సంఘం కార్యదర్శి డి. సుధాకర్ తెలిపారు. సోమవారం నిర్మల్ లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఆదాయపు పన్ను సమస్యలు ఈ నెల 26న లక్నోలో జరిగే జాతీయ కాన్ఫరెన్స్‌లో చర్చిస్తామని, 10 లక్షల వరకు వెసులుబాటు కలిగేలా కేంద్రానికి ప్రాతినిధ్యం చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నగదు రహిత వైద్యం, 1983లో స్పెషల్ టీచర్లకు నేషనల్ ఇంక్రిమెంట్ ఇప్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నామని ఇతర సమస్యలు పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న, ఉమారెడ్డి, ధనలక్ష్మి, నాగమాంబ, కే. గంగాధర్, చందులాల్, ఆర్. హనుమంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

నిర్మల్ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు నిర్మల్ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి బి. కృష్ణ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు అనూష తెలిపారు. డీటీడీవో, పీడీ భుక్యా రమేష్, తదితరులు అభినందించారు. మెదక్‌లో జరిగే పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నాడు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

సోన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూజాపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బోండ్ల గంగాధర్, వైస్ చైర్మన్ రాజారెడ్డి, డైరెక్టర్లు గంగాధర్, నారాయణ, నవీన్, గాండ్ల నవీన్, నారాయణ , భరత్, రాము, బొడ్డు లింగన్న, నాయుడు పోశెట్టి, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ ఉప సర్పంచ్ భూమన్న, సీఈవో వినయ్, పూసల నారాయణ, డైరెక్టర్ భూమన్న, గ్రామ స్థులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో కార్తీకపూజలు





కార్తీకమాసం పురస్కరించుకొని దీపాలంకరణ పూజ.. చిన్నారులు నృత్య ప్రదర్శన

బాసర, నవంబర్ 12 : (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో కార్తీకమాసం పురస్కరించుకొని ప్రత్యేకపూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రతీరోజు సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంగళవారం ఈ దీపోత్సవ కార్యక్రమం కన్నులపండువగా జరిగింది. మరోప్రక్క ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు వచ్చి భరతనాట్యం, కూచిపూడి వంటి ప్రదర్శిస్తున్నారు. మంగళవారం చిన్నారుల భరతనాట్యం, కూచిపూడి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ప్రతీరోజు ప్రత్యేక కార్యక్రమాలు

(ఆలయ ఈవో విజయ రామారావు)

కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. మంగళవారం ఆలయ చైర్మన్ శరత్ పాఠక్, ఆలయ వైదిక సిబ్బందితో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా ఈ సారి పవిత్ర కార్తీకమాసంలో విశిష్టమైన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు 13వ తేదిన గోదావరి తీరంలో నది హారతి పూజ, జ్వాల తోరణము, 15వ కార్తీక పౌర్ణమి సందర్భంగా గోదావరికి మహాహారతి, ఈ నెల 18వ తేదిన సోమవారం భస్మ హారతి, 19వ తేదిన సామూహిక సత్యనారాయణ వ్రత పూజ (ఉచిత ప్రవేశం), 25వ తేదిన గోదావరి తీరంలో రుద్రాత్రి శతి నామార్చన పూజా కార్యక్రమాలు జరగనున్నట్లు వివరించారు భక్తులు పెద్దసంఖ్యలో హాజరైన విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, వేద పండితులు నవీన్‌శర్మ, అర్చకులు మదన్ మహారాజ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఆలయ ఈవో విజయరామారావు

ఏబీవీపీ శ్రేణులపై దాడులకు పాల్పడ్డ

వారందరిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

భైంసా, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాసర ట్రిపుల్ ఐటీలో చోటు చేసుకున్న విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై శాంతియుత నిరసనలకు దిగిన ఏబీవీపీ శ్రేణులపై పాశవిక దాడులకు పాల్పడ్డ వారందరిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ముథోల్ నియోజక వర్గ బీజేపీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం భైంసాలో ఏఎస్పీ అవినాష్ కుమార్‌ను కలిసి సంబంధిత విషయంలో బీజేపీ ప్రతినిధుల బృందం వినతి పత్రం అందచేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపల్లి గంగాధర్, ముథోల్ నియోజక వర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్‌లు మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ చీఫ్ సెక్యూరిటీ అధికారి రాకేష్ ఆదేశాలతో సెక్యూరిటి సిబ్బంది ఏబీవీపీ శ్రేణులపై కర్రలు, ఇనుప రాడ్లతో పాశవిక దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. రోడ్లపై ఈడ్చుక వెళ్లి చితక బాదినట్లుగా వివరించారు. రౌడి మూకల తీరుతో చీఫ్ సెక్యూరీటి అధికారి రాకేష్ స్వయంగా ఏబీవీపీ శ్రేణులపై దాడికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. అంతేకాకుండా అక్కడి సెక్యూరీటి సిబ్బందిని ఆయన ఉసిగొల్పడంతో వారంరదూ ఏబీవీపీ శ్రేణులపై విచక్షణరహితంగా చితకబాదరని వివరించారు. కర్రలు, రాడ్లతో జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఏబీవీపీ ప్రతినిధి ఒకరు చావుబతుకుల మధ్య హైదరాబాద్‌లోని కార్పోరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. మరికొంత మంది ప్రతినిధులు గాయాల బారిన పడి తీవ్ర అస్వస్థత చెందినట్లుగా పేర్కొన్నారు. ఏబీవీపీ శ్రేణులపై పాశవికంగా వ్యవహరిస్తూ దాడులకు పాల్పడ్డ అక్కడి చీఫ్ సెక్యూరీటి అధికారి రాకేష్‌తో పాటు సెక్యూరీటి సిబ్బందిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను చేపడుతామని వెల్లడించారు.



భైంసాలో ఏఎస్పీ అవినాష్ కుమార్‌కు వినతిపత్రం అందచేస్తున్న బీజేపీ ప్రతినిధులు

ఓటు హక్కు ఎంతో విలువైనది

కుంటాల, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : ఓటు హక్కు ఎంతో విలువైందని ఆర్‌ఐ అడెల్లు అన్నారు. మంగళవారం కుంటాల మండలంలోని కల్లూరు వాసవి జూనియర్, డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు నమోదు, ఓటు యొక్క విలువ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ప్రస్తుతం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఆయా గ్రామాలలో తమ తమ బీఎల్‌వోల వద్ద ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాయిలు, శ్రీని వాస్, విద్యార్థులు అధ్యాపకులు ఉన్నారు.



కల్లూరు వాసవి కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఐ అడెల్లు

తాంసి మండలంలో జ్వరాలు

తాంసి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యాధుల తీవ్రత రోజు రోజుకు పెరుగుతుంది. వాతావరణ పరిస్థితుల ప్రభావమో... లేక తాగునీటి కలుషితమో తెలియదు గాని మండలంలోని చాలా గ్రామాల్లో రోగులు మంచం పట్టారు. దినం పూట ఎండ, చీకటి పడిందంటే చలి ఉండటం వల్ల జనం వ్యాధుల బారిన పడుతున్నారేమోనని పలువురు పేర్కొంటున్నారు. గ్రామాలలో దోమల మందు స్ప్రే చేయకపోవడం, చెత్తా చెదారం పేరుకుపోయి ఉండటంతో కూడా దోమలు ఎక్కువై రోగాలు వ్యాపిస్తున్నాయి.

సమగ్ర కుటుంబ సర్వేకు

ప్రతీ ఒక్కరు సహకరించాలి

● భైంసా మున్సిపల్ ప్రత్యేకాధికారి రాథోడ్ సుదర్శన్



భైంసాలో సర్వేను పర్యవేక్షిస్తున్న ప్రత్యేకాధికారి రాథోడ్ సుదర్శన్

భైంసా, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు పట్టణవాసులందరూ బాధ్యతగా బావించి సహకరించాలని భైంసా మున్సిపల్ ప్రత్యేకాధికారి రాథోడ్ సుదర్శన్ పిలుపునిచ్చారు.మంగళవారం భైంసా పట్టణ పరిధిలోని ఆయా వార్డులలో జరుగుతున్న సర్వేను పర్యవేక్షించారు. మున్సిపల్ కమీషనర్ రాజేష్ కుమార్ సారధ్యంలో ఎన్యూమరేటర్లతో కలిసి వెళ్లి సర్వే నిర్వాహణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమగ్ర కుటుంబ సర్వే ప్రత్యేకాధికారి రాథోడ్ సుదర్శన్ మాట్లాడుతూ సర్వే నిర్వాహణకు వచ్చే ఎన్యూమరేటర్లకు యాజమానులు తమ కుటుంబానికి చెందిన వివరాలు అందించాలని పేర్కొన్నారు. అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేకు శ్రీకారం చుట్టిందని వివరించారు. సర్వేపై ఎవరు ఎలాంటి అనుమానాలు పెట్టుకోకుండా ఎన్యూమరేటర్లకు వివరాలు అందించాలని కోరారు. అనంతరం ఆయా ప్రాంతాల్లోని ఎన్యూమరేటర్లతో సర్వే నిర్వాహణ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించి దిశ, నిర్దేశం చేశారు. తప్పిదాలకు తావులేకుండా, లోపాలకు అస్కారం లేకుండా సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. సందేహాలు, సమస్యలు ఏర్పడిన పక్షంలో అధికారులతో వెంటనే మాట్లాడి వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు.ఇందులో మున్సిపల్ మేనేజర్ గౌరిష్‌కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారిణి అనురాధతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



• ట్రిపుల్ ఐటీ ప్రధాన గేటు వద్ద పోలీసు బలగాలు

ట్రిపుల్ ఐటీ వద్ద భారీ బందోబస్తు

• కొనసాగిన విద్యార్థి సంఘాల నిరసన • ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బందిపై కేసులు నమోదు చేసిన పోలీసులు
• మృతురాలు స్వాతిప్రియ తోటి విద్యార్థులు, అధికారుల ఘన నివాళులు • కట్టుదిట్టమైన భద్రత మధ్య క్యాంపస్



• ట్రిపుల్ ఐటీ ప్రవేశ ద్వారం వద్ద బీఆర్ఎస్ విద్యార్థి విభాగ నాయకుల నిరసన



మృతిచెందిన విద్యార్థికి నివాళులర్పిస్తున్న వైస్ చాన్సలర్ గోవర్ధన్, విద్యార్థులు సిబ్బంది



బాసర, నవంబరు12: (ఆంధ్రజ్యోతి) బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ వద్ద భారీ పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. పీయూసీ-2 విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం విద్యార్థి సంఘాల నిరసన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద 50 మంది స్పెషల్ పోలీసులను మోహరించారు. ఎవరిని లోనికి అనుమతించడం లేదు. ఏబీవీపీ కార్యకర్తలపై దాడికి దిగడంతో సెక్యూరిటీ సిబ్బందిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం యూనివర్సిటీలో భద్రతంతా పోలీసుల ఆధీనంలో ఉంది.

• బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నిరసన

బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటీ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు ట్రిపుల్ ఐటీలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ప్రధాన గేటు వద్దనే బైటాయించి ఆందోళన చేశారు. స్వాతిప్రియ ఆత్మహత్యకు వేధింపులే కారణమని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

• సెక్యూరిటీ సిబ్బంది, ఏబీవీపీ కార్యకర్తలపై పోలీసు కేసులు

ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బందిపై బాసర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిరసన తెలిపేందుకు వచ్చిన ఏబీవీపీ విద్యార్థులపై సెక్యూరిటీ సిబ్బంది కర్రలతో దాడి చేయడంతో పలువురికి తీవ్రగాయాలైన విషయం తెలిసిందే. ఏబీవీపీ ఫిర్యాదు మేరకు ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందిపై బీఎన్ఎస్ 118, 351, 352 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీపై దాడికి పాల్పడిన ఏబీవీపీ కార్యకర్తలపై బీఎన్ఎస్ 118, 329 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మృతిచెందిన విద్యార్థి స్వాతి ప్రియ తల్లి మనోవేదనతో బాసర ఎస్సై గణేష్ చొక్కా కాలర్‌ను పట్టుకోవడం ఘటనపై కూడా పోలీసులు కేసు నమోదు చేస్తున్నట్లు తెలిసింది.

• విద్యార్థికి నివాళులు

ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి స్వాతిప్రియకు తోటి విద్యార్థులు ఘనంగా నివాళ్లలర్పించారు. మంగళవారం సా యంత్రం పరిపాలన భవనం వద్దకు చేరు కున్న వేలాది మంది విద్యార్థులు యూనివ ర్సిటీ వైస్ చాన్సలర్ గోవర్ధన్, అడ్మినిస్ట్రేటి వ్ ఆఫీసర్ రణధీర్ పూలమాల వేసి శ్రద్ధా ంజలి ఘటించారు. యూనివర్సిటీలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని వైస్‌చాన్సలర్ పేర్కొన్నారు. విద్యార్థులు ఏదైనా సమస్య ఉంటే తమదృష్టికి తేవాలని సూచించారు.

• కొవ్వొత్తులు వెలిగించి..


బాసర ట్రిపుల్ ఐటీలో మృతి చెందిన పీయూసీ -2 విద్యార్థిని స్వాతిప్రియకు తోటి విద్యార్థులు ఘన నివాళులర్పించారు. మంగళవారం సాయంత్రం అకాడక్ బ్లాక్ వద్దకు చేరుకొని వందలాది మంది విద్యార్థులు కొవ్వొత్తుల, సెల్ ఫోన్ లైట్లను వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు.



సెల్‌ఫోన్ లైట్లు, కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న తోటి విద్యార్థులు

పల్లెల్లో ప'రేషన్'!

• గ్రామీణ ప్రాంతాలకు దూరంగా చౌకదరల దుకాణాలు • లబ్ధిదారులకు తప్పని ఇక్కట్లు



కుభీర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు ప్రతీనెల రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నాయి. అయితే మండలంలోని కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ దుకాణాలు లేవు. దీంతో ప్రజలు పక్క గ్రామాల్లో వారికి కేటాయించిన దుకాణాలుండటంతో రేషన్ తెచ్చుకునేందుకు ప్రతీనెల అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఇదే తంతు కొనసాగుతున్నా ఈ సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదు. ఈ విషయమై ఆయా గ్రామాల ప్రజల అధికారులకు విన్నపాలు చేసిన పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు బియ్యం తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై ప్రభుత్వం స్పందించి రేషన్ దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

• మండలంలో ఇది పరిస్థితి

మండలంలోని 42గ్రామపంచాయతీలు, 38 ఆవాస గ్రామాలు ఉన్నాయి. అందులో అప్పట్లో 550 రేషన్ కార్డులకు ఒక దుకాణం చొప్పున మండలంలో మొత్తం 27 దుకాణాలు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వాలు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినా కాని చౌకధరల దుకాణాలు మాత్రం ఏర్పాటు చేయలేదు. పాత పద్ధతిలోనే సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. మండలంలోని అన్నపూర్ణ 1, 820 అంత్యోదయ, 13368 తెలుపు కలిసి మొత్తం 14189 రేషన్‌కార్డులకు గాను ప్రతి నెల 2890.44 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేస్తున్నారు. మండల కేంద్రంలో మూడు దుకాణాలు ఉన్న మిగతా గ్రామాల్లో రెండు మూడు గ్రామాలకు కలిపి ఒక గ్రామంలోనే ఏర్పాటు చేయడంతో మిగతా గ్రామాల ప్రజలు ప్రతి నెల ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించా..

• సోము తహసీల్దారు కుభీర్

గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు విషయమై ఫిర్యాదులు అందుతున్నాయి. 550 మంది రేషన్ కార్డులకు ఒక దుకాణం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఎక్కడెక్కడ దుకాణాలు అవసరమో నివేదికలు రూపొందించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది.



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

ఉత్సాహంగా గురుకుల 10వ జోనల్‌స్థాయి ఆటల పోటీలు

ముథోల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముథోల్ నియోజకవర్గంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో 10వ జోనల్ స్థాయి క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఐదు జిల్లాల నుంచి హాజరైన 1020 మంది క్రీడాకారులు పోటాపోటీని తమ ప్రతిభ కనబరిచేందుకు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. జరుగుతున్న జోనల్ లెవెల్ గేమ్స్‌లలో అండర్-17 బ్యాడ్మింటన్‌లో విన్నర్‌గా (మేడిపల్లి), రన్నర్‌గా (ఉప్పల్వాయి), క్యారంలో విన్నర్‌గా ముథోల్, రన్నర్‌గా బోధన్, అథ్లెటిక్స్‌లో 200 మీటర్ల పరుగుపందెంలో నవదీప్ (మేడిపల్లి), పి.గౌతమ్ (ఉప్పల్వాయి) గెలుపొందారు. 400 మీటర్లలో ఎం.నవదీప్ (మేడిపెల్లి), జి.చందు (ఆర్మూర్), 1500 మీటర్లలో వి.సిద్ధార్థ (ముథోల్), ఎన్. శివాజీ (బిక్నూర్), 500ల మీటర్లలో కేశవ్ సింగ్ (ఉప్పల్వాయి), బి.సంతోష్ (ఇచ్చోడ), షాట్ పుట్‌లో గౌతం (ఉప్పల్వాయి), పరమేష్ (ఎల్లారెడ్డి), డిస్కస్‌లో గౌతం (ఉప్పల్వాయి), జే.శ్రీల (మేడిపల్లి)లు గెలుపొందారు.



చెస్ ఆడుతున్న విద్యార్థులు



మరమ్మతులకు నోచుకోని కుమ్మరికుంట రోడ్డు ఇదే..



జైథ్‌రామ్ తండా రోడ్డుపై పడిన గుంత



అధ్వానంగా మారిన దోబీఘాట్ రోడ్డు



అధ్వానంగా రోడ్లు.. అవస్థల్లో ప్రజలు

• ఉట్నూరులోని అనేక గ్రామాల్లో మరమ్మతులకు నోచుకోని రోడ్లు • ఇబ్బందుల మధ్య గిరిజనుల రాకపోకలు

ఉట్నూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని అనేక గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. గత కొన్నేళ్లుగా రోడ్లకు మరమ్మత్తులు చేయకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో కూడా నిధులు మంజూరు కాక పోగా కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న రోడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేదని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఉట్నూర్ మండలంలోని నర్సాపూర్, జైత్రంతండా, చందూరి, దోబిఘాట్, ఉమ్రి, ఏందా, కుమ్మరికుంట, నర్సాపూర్, వడని, గంగాపూర్, లక్కేటిపేట్, రాజన్నగూడెం ప్రాంతాలలో రోడ్లు చెడిపోయి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్లపై కంకర లేచి పోవడంతోపాటు రహదారి వెండి అనేక గుంతలు ఏర్పడడంతో ప్రజలు ప్రమాదాల బారీన పడుతున్నారు. ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు సైతం నడవలేని స్థితిలో రోడ్లు ఉండడంతో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

• మరమ్మతులు ప్రతిపాదనలకే పరిమితం

ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్ మండలాల్లోని చెడిపోయిన రోడ్ల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించి రెండేళ్లు కావస్తున్నా మంజూరు లభించ లేదు. ఉట్నూర్ మండలంలోని లకారం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మత్తగూడ రోడ్డుకు రూ.2.90 కోట్లు, కొత్తగూడ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఘన్పూర్ రోడ్డుకు రూ.2.20 కోట్లు, ఇంద్రవెల్లి మండలంలోని ముత్తునూరు నుంచి వైపేట రోడ్డుకు రూ.8.95 కోట్లు, ఇంద్రవెల్లి నుంచి చించిదరి రోడ్డుకు రూ.3.80 కోట్లు, కేస్లాపూర్ నుంచి కోయల్‌పాండ్రి, దస్నాపూర్, పిట్టబొంగరం రోడ్ల మరమ్మతులకు రూ.4.25 కోట్లు, ముతునూరు నుంచి ఖండాల రోడ్డుకు రూ.3.80 కోట్లు, ఆర్‌అండ్‌బీ నుంచి పిప్పిరిరోడ్డుకు రూ.95 లక్షలు, నార్నూర్ మండలంలోని గుంజాల నుంచి తడహత్నూర్ రోడ్డుకు రూ.73 లక్షలు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదలు కాలేదు. దీంతో గుంతలు, కంకర లేచిన రోడ్లపైనే వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఏజెన్సీ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

• పవార్ రమేష్, డీఈఈ, పీఆర్ ఉట్నూర్



తమ పరిధిలోని ఉట్నూర్ ఇంద్రవెల్లి నార్నూర్ మండలాల్లో ఉన్న మరమ్మతుల రోడ్ల నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు వస్తే రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం.

రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు ఎంపికైన విద్యార్థి



లక్ష్మణచాంద, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనకాపూర్ అక్షర హైస్కూల్‌కు చెందిన విద్యార్థి వి. మహేష్ జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు అర్హత సాధించారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థిని పాఠశాల డైరెక్టర్లు నరేష్‌రెడ్డి, జారెడ్డిలు అభినందించి, శాలువాతో సత్కరించారు.

బెంబేలెత్తిస్తున్న పెద్దపులి





మూడు రోజుల క్రితం నిర్మల్ - ఆదిలాబాద్ రహదారిపై మహబూబ్ ఘాట్ వద్ద రోడ్డు దాటుతున్న పెద్దపులి (ఫైల్)



కుంటాల మండలంలో పులి పాదముద్రలు సేకరిస్తున్న అధికారులు (ఫైల్)

పెద్దపులి పాదముద్రలు (ఫైల్)

- జిల్లాలో నెల రోజులుగా జిల్లా అడవుల్లో పులి తిష్ట
- పలు ప్రాంతాల్లో సంచరిస్తూ పశువులపై దాడి
- మహారాష్ట్ర తిప్పేశ్వర్ అడవుల నుంచి వచ్చిందని అంచనా
- క్రమేపి కవ్వాల్ అభయారణ్యం వైపు పెద్ద పులి అడుగులు
- తాజాగా మామడ రేంజ్ పరిధిలోని బూరుగుపల్లి అడవుల్లో ఎద్దుపై దాడి
- అప్రమత్తమైన అటవీశాఖ.. నాలుగు బృందాలతో పులి కదలికలపై నిఘా

ఖానాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల్ అభయారణ్యం పెద్దపులుల ఆవాసం కోసం ఈ అభయారణ్యాన్ని టైగర్‌జోన్‌గా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నాటి నుంచి పెద్దపులి ఇక్కడి అడవుల్లో ఆవాసం ఏర్పర్చుకునేలా ఎన్నో సంరక్షణ చర్యలు చేపట్టారు. అధికారులు చేపడుతున్న పులి సంరక్షణ చర్యలతో కవ్వాల్ టైగర్ జోన్‌లో పెద్దపులుల సంచారం అడపాదడపా కనిపించినా ఇప్పటివరకు పెద్దపులి స్థిరంగా ఉన్న దాఖలాలు మాత్రం కనిపించలేవనే విమర్శలున్నాయి. అందుకు ఎన్నో కారణాలున్నప్పటికీ అడవుల్లో అలజడిని తగ్గించడంలో అధికారులు ఆశించిన స్థాయిలో సఫలీకృతం కాకపోవడంతోనే పెద్దపులి అభయారణ్యంలో తన ఆవాసాన్ని ఏర్పరచుకోవడం లేదని పలువురు జంతు ప్రేమికులు ఆరోపిస్తున్నారు. దీంతో గత కొన్నేళ్లుగా కవ్వాల్ అభయారణ్యానికి మహారాష్ట్ర ప్రాంతంలోని తిప్పేశ్వర్ అడవులకు మధ్య కారిడార్ ఉండడంతో పెద్దపులులు అటు నుంచి ఇటు నుంచి అటు రాకపోకలు సాగించేందుకు అనుకూలమైన పరిస్థితులను కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్ర ప్రాంతంలోని తిప్పేశ్వర్ అడవుల నుంచి ఆదిలాబాద్ జిల్లా మీదుగా నిర్మల్ జిల్లాలోకి ప్రవేశించిన పెద్దపులి గత నెల రోజులుగా జిల్లా ప్రజలను బెంబేలెత్తిస్తోంది. తిప్పేశ్వర్ ప్రాంతం నుంచి తెలంగాణ అడవుల్లోకి మూడు పెద్ద పులులు వచ్చాయని ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఈ ప్రచారాన్ని అటవీశాఖ అధికారులు వట్టి వదంతులుగానే కొట్టిపడేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో సంచరిస్తున్న పెద్దపులి తాజాగా క్రమేపి కవ్వాల్ వైపు అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పులిసంచారంపై నాలుగు బృందాలతో నిఘా ఏర్పాటు చేశారు. పెద్దపులికి హాని కలిగించకుండా గ్రామాల్లో ముమ్మరంగా పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మీదుగా అడెల్లి అడవుల్లోకి

ప్రస్తుతం జిల్లాలో సంచరిస్తున్న పెద్దపులి మహారాష్ట్ర ప్రాంతంలోని తిప్పేశ్వర్ అడవుల నుంచి తొలత ఆదిలాబాద్ జిల్లా బోథ్ అడవుల్లోకి ప్రవేశించినట్లు అధికారులు చెబుతున్నారు. బోథ్ అడవుల్లో కొద్దిరోజులపాటు తిష్ట వేసిన బెబ్బులి జిల్లాలోని సారంగాపూర్ మండలం అడెల్లి అడవుల్లోకి ప్రవేశించడం ద్వారా జిల్లాలోకి అడుగు పెట్టినట్లు చెబుతున్నారు. అడెల్లి అడవుల నుంచి కుంటాల మండలం సూర్యాపూర్, అంబుగావ్, మెదన్పూర్, దౌనెల్లి మీదుగా తిరిగి సారంగాపూర్ మండలం మహబూబ్‌ఘాట్ వద్ద రోడ్డు దాటుతూ ప్రయాణికులకు కనిపించింది. తాజాగా పెద్దపులి మామడ అటవీ రేంజ్ కార్యాలయం పరిధిలోని బూరుగుపల్లి అడవుల్లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

పలుచోట్ల పశువులపై దాడి

అడెల్లి అడవుల్లో ప్రవేశించడం ద్వారా జిల్లాలోకి వచ్చిన పెద్దపులి కుంటాల మండలం మెదన్పూర్, సూర్యాపూర్ శివారులో ఒక లేగదూడ, ఒక ఆవుపై దాడి చేసి చంపింది. అదే రోజు అడవుల్లో పశువులను మేపేందుకు వెళ్లి పశువుల కాపరి వెంట పడగా అతడు చెట్టు ఎక్కి ప్రాణాలను దక్కించుకున్నాడు. అక్కడి నుంచి అంబుగాం శివారులోకి వెళ్లిన పెద్ద పులి అక్కడ అడవుల్లో సుదర్శన్ పటేల్ అనే రైతుకు చెందిన ఆవును గాయపరిచింది. అంబుగాంలో కనిపించిన పెద్దపులి ఆ తర్వాత కుంటాల గజ్జెలమ్మ ఆలయ సమీపంలో వాకింగ్ చేస్తున్న వారికి కనిపించింది. దీంతో బెంబేలెత్తిపోయిన వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో గజ్జెలమ్మ ఆలయ సమీపంలో పులి పాదముద్రలను సైతం అటవీశాఖ అధికారులు గుర్తించారు. మూడు రోజుల క్రితం నిర్మల్, ఆదిలాబాద్ రహదారిపై మహబూబ్‌ఘాట్ వద్ద రాత్రి వేళలో రోడ్డు దాటుతూ వాహనదారులకు పెద్దపులి కనిపించడంతో వారు సెల్ ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తాజాగా తాంద్ర, మామడ అటవీ రేంజ్ కార్యాలయాల పరిధిలోని అడవుల్లో సంచరిస్తున్న పెద్దపులి బూరుగుపల్లి వద్ద ఓ ఎద్దుపై దాడి చేసి చంపింది. ఇలా వరుసగా పెద్దపులి పశువులపై దాడి చేస్తుండడంతో అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ క్షేత్రాలలోకి రాత్రనక పగలనకా వెళ్లే తమకు ఈ పెద్దపులి సంచారం తీవ్ర భయాందోళనలు కలిగిస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్రమత్తమైన అటవీ శాఖ

జిల్లాలో పెద్దపులి సంచరిస్తున్న నేపథ్యంలో అటవీశాఖ అప్రమత్తమైంది. ప్రస్తుతం పెద్దపులి కదలికలపై పకడ్బందీ నిఘాను ఏర్పాటు చేసింది. జిల్లాలో నాలుగు బృందాలతో పులి రాకపోకలపై మానిటరింగ్ నిర్వహిస్తున్నారు. పెద్దపులికి హాని తలపెట్టకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అడవులను ఆనుకొని ఉన్న వ్యవసాయ క్షేత్రాలలో విద్యుత్ తీగలు లాంటివి అమర్చవద్దని కోరుతున్నారు. పులి సంచరిస్తున్న నేపథ్యంలో ఒంటరిగా అడవుల్లోకి వెళ్లవద్దని కోరుతున్నారు. పులి సంచరిస్తున్న నేపథ్యంలో ఒంటరిగా అడవుల్లోకి వెళ్లవద్దని చెబుతున్నారు. ఖచ్చితంగా వెళ్లాల్సిన పరిస్థితి వస్తే బృందాలుగా వెళ్లాలని సూచిస్తున్నారు. అడవుల్లోకి పశువులను పంపవద్దని అలా పంపడం ద్వారా పెద్దపులి వాటిని వేటాడేందుకు ఈ ప్రాంతాల్లోనే ఆవాసం ఏర్పాటు చేసుకుంటుందని చెబుతున్నారు. పులి కవ్వాల్ టైగర్ జోన్‌లోకి వెళ్లే వరకు అడవుల్లోకి పశువులను మేతకు తీసుకెళ్లకపోతే పులి తన ఆహారాన్ని వెతుక్కుంటూ అడవుల్లోకి వెళ్లిపోతుందని అవగాహన కల్పిస్తున్నారు. పెద్దపులి రాకపోకలను గుర్తించేందుకు కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేయడంతో పాటు నిష్ణాతులైన బృం దంతో పులి పాదముద్రలను సైతం గుర్తిస్తున్నారు.

మూడు పులులు వచ్చాయంటూ ముమ్మర ప్రచారం

మహారాష్ట్ర ప్రాంతం నుంచి తెలంగాణ అడవుల్లో మూడు పెద్ద పులులు వచ్చాయంటూ ముమ్మరంగా ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారం అంతా వట్టి వదంతులేనని అటవీశాఖ అధికారులు కొట్టి పడేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో సంచరిస్తున్న పులి మాత్రమే తిప్పేశ్వర్ అడవుల్లోంచి వచ్చిందని తొలత అడెల్లి వరకు వచ్చిన పులి తిరిగి తిప్పేశ్వర్ బార్డర్ వరకు వెళ్లి అక్కడి నుంచి మళ్లీ జిల్లాకు తిరిగి వచ్చిందని చెబుతున్నారు. తిరిగి వచ్చిన పులి మగపులిగా గుర్తించినట్లు అటవీశాఖ అధికారులు నిర్ధారిస్తున్నారు. దాని పేరు జానీ అని సైతం పేర్కొంటున్నారు. ప్రస్తుతం జానీ ఒక్కటే జిల్లా అడవుల్లో సంచరిస్తోందని చెబుతున్నారు.

క్రమేపీ కవ్వాల్ వైపు జానీ కదలిక

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సంచరిస్తున్న జానీ అనే మగపెద్ద పులి క్రమేపి కవ్వాల్ టైగర్‌జోన్ వైపు కదులుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మూడు రోజుల క్రితం మహబూబ్ ఘాట్ వద్ద రోడ్డు దాటిన పెద్దపులి తాజాగా తాంద్ర, మామడ అటవీరేంజ్ కార్యాలయాల పరిధిలో గల అడవుల్లో సంచరిస్తోంది. ఈ పెద్దపులి కవ్వాల్ టైగర్‌జోన్ వైపు వెళ్తే అక్కడ ఇబ్బడి ముబ్బడిగా ఉన్న శాఖాహార జంతువులను వేటాడుతూ అక్కడే తన ఆవాసాన్ని స్థిరంగా ఏర్పాటు చేసుకుంటుందని అటవీశాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఓ వారం రోజులపాటు అడవుల్లోకి పశువులను మేతకు తీసుకెళ్లకపోతే పెద్దపులి కవ్వాల్ అభయారణ్యంలోకి ప్రవేశించదని వారు చెబుతున్నారు. మొత్తానికి చాలా రోజుల తర్వాత కవ్వాల్ అభయారణ్యం వైపు కదు లుతున్న పెద్దపులి అక్కడ స్థిరంగా తన ఆవాసాన్ని ఏర్పాటు చేసుకుంటుందా తిరిగి మహారాష్ట్ర తిప్పేశ్వర్ వైపు వెళ్లిపోతుందా అనేది ప్రస్తుతం ఆసక్తిగా మారింది. పులి ద్వారా ప్రస్తుతం పశు సంపదను కోల్పోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందుతుందని పులికి ఎటువంటి హాని తలపెట్టవద్దని అధికారులు కోరుతున్నారు.

అడవుల్లోకి పశువులను మేతకు తీసుకవెళ్లొద్దు

ప్రస్తుతం జిల్లాలో జానీ అనే మగ పులి సంచరిస్తోంది. ఈ పులి క్రమేపి కవ్వాల్ అభయారణ్యం వైపు అడుగులు వేస్తోంది. ఈ సమయంలో అడవుల్లోకి పశువులను మేతకు తీసుకెళ్లవద్దు. పశువుల వేటకు అలవాటు పడితే పెద్దపులి ఇక్కడే ఉండిపోతుంది. పెద్దపులి కవ్వాల్ అభయారణ్యంలోకి వెళ్లేలా అటవీ శాఖ అధికారులు చేపట్టిన చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. పులికి ఎటువంటి హాని తలపెట్టవద్దు. నష్టం జరిగిన రైతులకు తప్పకుండా నష్టపరిహారం అందుతుంది. ఒంటరిగా అడవుల్లోకి వెళ్లవద్దు.

నిర్మల్ ఇన్‌చార్జి డీఎఫ్‌వో నాగిని భాను

సంక్షిప్త సమాచారం

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



తలారి సతీష్ (ఫైల్)

లక్ష్మణచాంద, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన తలారి సతీష్(26) అనే యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై సుమలత తెలిపిన వివరాల ప్రకారం... సతీష్ మంగళవారం రోజే అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో ఇంటి ముందర గల ఇనుప బొంగు కొక్కానికి తాడుతో ఉరి వేసుకున్నాడు. ఈ సంఘటనను గమనించిన స్థానికంగా గల కుక్కలు మొరగటంతో మృతుడి బాబాయ్ పోతన్నకు మెలుకువ వచ్చి బయటకు రాగా మృత దేహం వేలాడుతున్న దృశ్యాన్ని చూశాడు. ఇరుగు పొరుగు వారికి సమాచారమిచ్చి సతీష్ తల్లి, చెల్లెకు విషయం చెప్పటంతో బోరున విలపించారు. వివాహం కూడా కాని సతీష్ మరణించటంతో కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, గ్రామస్థులు విషన్న వదనంతో అతని అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు స్పష్టంగా తెలియలేదు. విషయం తెలిసిన మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

14న పేరెంట్ టీచర్స్

సమావేశం నిర్వహించాలి

నిర్మల్ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14న అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉపాధ్యాయ, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఏ- 1 ఫలితాలపై చర్చించాలని సమావేశంలో చర్చించిన వివరాలు ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

నడుస్తున్న బస్సులోంచి

దూకేసిన మహిళ



బస్సులో నుంచి దూకిన మహిళ

ముథోల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నడుస్తున్న బస్సులో నుంచి ఓ మహిళ కిందకి దూకింది. ఈ ఘటన మంగళవారం ముథోల్ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... నిజామాబాద్‌కు చెందిన ఓ కుటుంబం భైంసా మండలం దేగాం గ్రామంలో హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కారు. ముథోల్‌లోని కంటి ఆసుపత్రి వద్దకు రాగానే మహిళా ప్రయాణికురాలు ఒక్కసారిగా కిందికి దూకింది. గాయాలు కాగా 108లో ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు దూకడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రతీ ఇంటిని సందర్శిస్తూ.. సమగ్ర సర్వే చేయాలి

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఎన్యుమరేటర్‌కు సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య, కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ప్రతి ప్రతి ఇంటిలో సమగ్రసర్వేను పక్కాగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని ఏఎన్‌రెడ్డి కాలనీ, రాంనగర్‌లలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణ కోసం నిర్వహిస్తున్నట్లు సమగ్ర సర్వే తీరును కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే కోసం హౌస్ లిస్టింగ్ ప్రక్రియ సందర్భంగా ఇళ్లకు అతికించిన స్టిక్కర్లపై నమోదు చేసిన వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సర్వే ఫారంలోని ప్రశ్నావళి ప్రకారం నిర్ణీత నమూనాలో సమాచారాన్ని సేకరిస్తున్నారా లేదా అన్నది తనిఖీ చేశారు. ప్రతి కుటుంబంలోని ఒక్కోవ్యక్తి వారీగా పూర్తి సమాచారాన్ని సేకరించాలని ఎన్యుమరేటర్‌కు సూచించారు. ఇప్పటివరకు ఎన్ని ఇళ్లల్లో సర్వే పూర్తయ్యింది, కుటుంబ వివరాల సేకరణ సందర్భంగా ఏవైనా ఇబ్బందులు ఎదురయ్యాయా...? కొత్తగా గమనించిన అంశాలు ఏమైనా ఉన్నాయా...? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ... ఏ చిన్న తప్పిదానికి సైతం తావు లేకుండా నిర్ణీత కోడ్‌లను పొందుపరుస్తూ స్పష్టమైన సమాచారంతో దరఖాస్తు ఫారాలను పూరించాలని సూచించారు. ప్రతి ఎన్యుమరేటర్ రోజుకు సగటున కనీసం 15 ఇళ్లను సందర్శిస్తూ సర్వే ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్యుమరేటర్లకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ, సర్వే ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ చేయాలని సూపర్‌వైజర్లను ఆదేశించారు. ప్రతి ఎన్యుమరేటర్ సమయానికి నిర్దేశించిన ఎన్యుమరేషన్ బ్లాకుల్లో సర్వేను చేపట్టాలన్నారు. సర్వే నిర్వహించే కుటుంబాల సభ్యులు ఎవరైనా అందుబాటులో లేనట్లయితే వారి గుర్తింపు పత్రాల ఆధారంగా వారి వివరాలు నమోదు చేయాలన్నారు. ఇప్పటి వరకు పూర్తయిన సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మెప్మా పీడీ సుభాష్, తహసీల్దార్ రాజు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పీచరలో పర్యటించిన రాష్ట్ర లేబర్ కమిషనర్

లక్ష్మణచాంద, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర లేబర్ కమిషనర్, సర్వే పరిశీలకులు శ్రీకృష్ణ ఆదిత్య, కలెక్టర్ అభిలాష అభినవ్ కలిసి మండలంలోని పీచర గ్రామంలో మంగళవారం పర్యటించారు. సర్వే జరుగుతున్న తీరుపట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలం మొత్తం మీద 10,308 గృహాలు ఉండగా తక్కువ కాలంలో 1,558 గృహాల సర్వే పూర్తి చేసినందుకు సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జాదవ్ అంబాజీ, ఎంపీడీవో రాధారాథోడ్, ఎంపీవో అమీర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్‌తో కలిసి ఆమె సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం, ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేసిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం అమ్మేందుకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో సరిపడినన్ని టార్పాలిన్లు, గన్ని బ్యాగులు, తేమ, తూకపు యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే రశీదు ఇచ్చి, ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరి మద్దతు ధర, కంట్రోల్ రూమ్ నంబరు, తదితర వివరాలు తెలిపే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అంతర్‌రాష్ట్ర సరిహద్దుల వద్ద ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించాలన్నారు. వరి ధాన్యాన్ని తీసుకువచ్చినప్పుడే రైతు వద్ద నుంచి ఆధార్, బ్యాంక్ ఖాతా త దితర జిరాక్స్ కాపీలను తీసుకొని త్వరితగతిన వారి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డిలు, సీపీవో జీవరత్నం, డీఎం సివిల్ సప్లయిస్ వేణుగోపాల్, డీఎస్‌వో కిరణ్ కుమార్, డీసీవో రాజమల్లు, ఏడీ మార్కెటింగ్ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విధులను బహిష్కరించిన

ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది

- ప్రధాన గేటు వద్ద బైఠాయింపు
- కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్

బాసర, నవంబరు 12 : (ఆంధ్రజ్యోతి) : బాసర ట్రిపుల్ ఐటీలో పని చేసే సెక్యూరిటీ సిబ్బంది ఆందోళనకు దిగారు. విద్యార్థి మృతి ఘటనలో ఏబీవీపీ కార్యకర్తలపై దాడికి దిగడంతో సెక్యూరిటీ సిబ్బందిలో ఇద్దరిపై పోలీసు కేసు నమోదైంది. దీన్ని నిరసిస్తూ తోటి 140 మంది సెక్యూరిటీ సిబ్బంది విధులను బహిష్కరించారు. మంగళవారం రాత్రి ప్రధాన గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. కేసును ఉపసంహరించుకునే వరకు విధుల్లోకి చేరబోమని స్పష్టం చేశారు.

విధుల నుంచి ట్రిపుల్ ఐటీ సీఐ తొలగింపు

బాసర, నవంబరు 12: (ఆంధ్రజ్యోతి) : బాసర ట్రిపుల్ ఐటీ సీఐ (చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్) రాకేష్‌ను మంగళవారం సాయంత్రం విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు పోలీసుశాఖ నుంచి ఉత్తర్వులు అందాయని యూనివర్సిటీ పరిపాలన అధికారి రణధీర్ తెలిపారు. విద్యార్థి ఆత్మహత్య ఆ తర్వాత ఏబీవీపీ నాయకుల నిరసనలో భాగంగా ప్రధాన గేటు వద్ద ఏర్పడ్డ ఉద్రిక్తత కారణంగా పోలీసుశాఖ ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తుంది. నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే కర్రలతో దాడుల వరకు వెళ్లిందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ట్రిపుల్ ఐటీలో పనిచేసే ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది నిరసన చేపట్టేందుకు వచ్చిన ఏబీవీపీ కార్యకర్తలపై కర్రలతో దాడులకు దిగడం వారిలో ఒకరు తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమించడం ఈ ఘటనపై పోలీసు అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. విచారించి దాడికి పాల్పడిన సెక్యూరిటీ ఇద్దరు సెక్యూరిటీ గార్డ్‌లపై హత్యాయత్నం కేసులునమోదు చేయడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐని విధుల నుంచి తప్పించారు.

వికారాబాద్ జిల్లా ఘటనను వ్యతిరేకిస్తూ

రెవెన్యూ ఉద్యోగుల నిరసనలు


- నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు
- దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసుకు డిమాండ్



తహసీల్దార్ కార్యాలయం ముందు రెవెన్యూ ఉద్యోగుల నిరసన

భైంసా, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఔషధ పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ నిమిత్తం వెళ్లిన వికారాబాద్ జిల్లాలో అధికారులపై జరిగిన దాడి ఘటనను వ్యతిరేకిస్తూ మంగళవారం భైంసా డివిజన్ వ్యాప్తంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిరసన ప్రదర్శనలు చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన అధికారులు, సిబ్బంది భోజన విరామ సమయంలో దాడి ఘటనను ఖండిస్తూ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసనలకు దిగారు. కార్యాలయాల ప్రవేశమార్గాల్లో దాడికి పాల్పడిన వారందరిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. దాడుల ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. భైంసాలోని అర్‌డీవో , తహసీల్దార్ కార్యాలయాల్లో నిరసన ప్రదర్శనలు జోరుగా కొనసాగాయి.

ఎస్సైపై దాడి సరైన చర్యకాదు



ఎస్పీకి వినతి పత్రం అందిస్తున్న పోలీసు అధికారుల సంఘం

నిర్మల్ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్య విషయంలో ఎస్సై గణేష్ స్పందించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోగా విద్యార్థి తాలూకు తల్లి ఆయనపై దౌర్జన్యానికి పాల్పడటం సరికాదని జిల్లా పోలీసు సంఘం తీవ్రంగా ఖండించింది. విద్యార్థి ఆత్మహత్యకు కారణాలు లేఖలో ప్రస్తావించిందని వ్యక్తిగత కారణాలతో మృతి చెందిందని పేర్కొన్నారు. కూతురు మృతితో మనోవేదన చెంది సంబంధం లేని ఎస్సైపై దౌర్జన్యానికి పాల్పడి పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీయవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సందరంగా ఎస్పీకి పోలీసు అధికారుల సంఘం వినతిపత్రం అందజేసింది.

బాసర ట్రిపుల్ ఐటీలో

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరపాలి

నిర్మల్ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాసరలో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం నాయకులు మాట్లాడుతూ... విద్యార్థి సంఘ నాయకులపై దాడి చేయడాన్ని ఖండించారు. విద్యార్థులకు కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలన్నారు. సీఎం ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోవడం విచారకరమన్నారు. కైలాష్, దిగంబర్, జవహర్, రాహుల్ పాల్గొన్నారు.

విద్యార్థులపై దాడి హేయనీయం

నిర్మల్ కల్చరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాసరలో విద్యార్థి ఆత్మహత్య సందర్భంగా నిరసన తెలుపుతున్న ఏబీవీపీ విద్యార్థులపై దాడి హేయనీయమని బీజేపీ నాయకుడు రావుల రాంనాథ్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ... ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు అరికట్టడంలో ప్రభుత్వం విఫలం అవుతోందన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సామ రాజేశ్వర్ రెడ్డి, సాధం అరవింద్, సాగర్, వెంకటేష్ పాల్గొన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరపాలని ఆప్ జిల్లా నాయకుడు సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు. బాలిక కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.